# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 273 | సంపుటి : 2 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం నవంబర్ 15-11-2024 | వెల : .రూ. 5.00




## తెలంగాణ అభివృద్ధికి వ్యతిరేకంగా
# కాంగ్రెస్, బీఆర్ఎస్

- పజలను తప్పదోవ పట్టిస్తున్న రెండు పార్టీలు
- బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని ప్రచారం దుర్మార్గం
- ప్రధానికి స్వాగతం పలకని వారు మాకు పాఠాలు చెబుతారా
- మీడియా సమావేశంలో మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

నవంబర్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్) న్యూఢిల్లీ,
తెలంగాణ అభివృద్ధికి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వ్యవహరిస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా కేసీఆర్, కేటీఆర్ తదితరులపై మండిపడ్డారు. గతంలో అధికారంలో ఉండగా ప్రధాన మంత్రి

-మిగతా 2 లో

## ఫార్మా భూమి అని చెప్పి..
# ఫోర్త్ సిటీ కోసం యత్నం



- హైకోర్టును తప్పదోవ పట్టిస్తున్న సీఎం రేవంత్
- లగచర్ల ఘటనతో రైతుల ఆగ్రహం బయటపడింది
- మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేత కేటీఆర్

నవంబర్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్) హైదరాబాద్,
తెలంగాణ హైకోర్టును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో భూముల ధరలు తగ్గాయని చెప్పారు. కాంగ్రెస్ మిగతా నాలుగు సంవత్సరాలు అధికారంలో ఉండాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. లగచర్లలో ఉంది ఫార్మా భూమి అని హైకోర్టు కోర్ట్‌కు సీఎం రేవంత్ అబద్దాలు చెబుతున్నారని మండిపడ్డారు. బయటకు వచ్చి ఫోర్త్

-మిగతా 2 లో



## జార్ఖండ్‌లో బీజేపీదే అధికారం

### సోరెన్ ఇంటికి వెళ్లడం ఖామన్న అమిత్ షా

రాంచీ,
ఝూర్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో హేమంత్ సోరెన్ సర్కారుకు ఓటమి తప్పదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఇక్కడ బిజెపి కూటమి గెలవడం ఖాయమని అన్నారు. ప్రజలు బిజెపి ప్రభుత్వాన్ని కోరకుంటున్నారని అన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన నవంబర్ 23 రోజే సీఎం హేమంత్ సోరెన్ అండ్ కంపెనీకి వీడ్కోలు అన్నారు.

-మిగతా 2 లో

## రూ.5 వేల కోట్లతో
# ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు




గత పదేళ్లలో 5వేల పాఠశాలలు మూతపడ్డాయి

- విద్యాశాఖకు బడ్జెట్‌లో 7 శాతానికి పైగా నిధులు
- రాష్ట్రం ఏర్పడ్డాక తొలిసారి బాలల దినోత్సవం
- హాస్టళ్లలో ఫుడ్‌పాయిజనింగ్ జరిగితే చర్యలు
- ఎల్బీ స్టేడియంలో బాలల దినోత్సవంలో సీఎం రేవంత్



నవంబర్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్) హైదరాబాద్,
రూ.5వేల కోట్లతో రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తాం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇటీవలే హాస్టల్ విద్యార్థులకు ఇచ్చే డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచామన్నారు. రాష్ట్రంలో గత పదేళ్లలో 5వేల పాఠశాలలు మూతపడ్డాయి. బడ్జెట్‌లో 7 శాతానికి పైగా నిధులు విద్యాశాఖకు కేటాయించాం. ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించాలని పదోన్నతులు ఇచ్చాం, బదిలీలు చేశాం. 11,062 టీచర్ పోస్టులు

-మిగతా 2 లో




## గ్రూప్-4 ఫలితాలు విడుదల

హైదరాబాద్,
తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-4 ఫలితాలను వెల్లడించింది. 8,084 మందితో కూడిన ప్రొవిజినల్ జాబితాను విడుదల చేసింది. 2022 డిసెంబర్ 1న ఇచ్చిన నోటిఫికేషన్‌లో భాగంగా 8,180 పోస్టులకు గాను 9,51,321 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు కమిషన్ పేర్కొంది. పలు దఫాల్లో ధ్రువపత్రాల పరిశీలన అనంతరం ఈరోజు ఫలితాలు వెల్లడించింది. పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ ను సందర్శించాలని సూచించింది.

# రైతుల ముసుగులో గులాబీ గుండాల అరాచకం



- దాడులతో అరచాకం సృష్టిస్టే కఠినంగా అణచివేస్తాం
- లగచర్లలో దాడిని ఉపేక్షించేది లేదు
- రైతులకు నష్టం చేసే ఉద్దేశ్యం లేదు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరిక

హైదరారాబాద్,
రైతుల ముసుగులో కొంతమంది గులాబీ గూండాలు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శలు చేశారు. కుట్రపూరితంగా అధికారులను రైతులకు దూరం చేసే ప్రయత్నం కొంతమంది చేస్తున్నారని మండిపడ్డారు. గులాబీ గూండాల కుట్రలను

-మిగతా 2 లో



## ప్రభుత్వంపై కొడంగల్ నుంచే వ్యతిరేకత

ఇలా ఎన్ని రోజులు అరెస్టు చేయిస్తాడో మేమూ చూస్తాం

కాంగ్రెస్‌కు ఓటేసినందుకు భూములు గుంజుకుంటావా..?

మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

హైదరాబాద్,
ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మి ఓటేసినందుకు ఇప్పుడు అనుభవిస్తున్నారని, రైతుల నుంచి బలవంతంగా ఇప్పుడు రేవంత్‌రెడ్డి భూములు

-మిగతా 2 లో



## అధికారం కోల్పోవడంతో రెచ్చగొట్టే యత్నాలు

- ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలో బీఆర్ఎస్ నేతలు
- డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క విమర్శలు

నవంబర్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్) హైదరాబాద్,
అధికారం కోల్పోయిన భారాస నేతలు ప్రజలను రెచ్చగొడుతున్నారని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మండిపడ్డారు. లగచర్ల ఘటనతో వారి కుట్రలు బట్టబయలు అయ్యాయని అన్నారు. అధికారం లేకపోవడంతో తట్టుకోలేక పోతున్నారని మండిపడ్డారు. ఉన్న ప్రభుత్వాన్ని కూల్చడం పైనే ఆ పార్టీ దృష్టి పెట్టిందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యం ఏంటో కేటీఆర్

-మిగతా 2 లో

# రూ.5వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు

(మొదటి తరువాయి)

భర్తీ చేశాం. టీచర్ పోస్టుల భర్తీ ద్వారా విద్యపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని నిరూపించామని సీఎం తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థుల కలలను నిజం చేయడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు. 'రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి బాలల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ భారత తొలి ప్రధానే కాదు.. దేశాన్ని ప్రపంచం ముందు గొప్పగా చూపించిన నేత అని,. నవీన భారత రూపశిల్పి నెహ్రూ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. వర్సిటీలకు ఉపకులపతులను నియమించాం. విద్యా వ్యవస్థను బాగు చేసేందుకు విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశాం. ప్రభుత్వ టీచర్లకు ఉన్న అర్హత ప్రైవేటు ఉపాధ్యాయులకు లేదు. అయినా పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించడానికి ఇష్టపడట్లేదు. ప్రభుత్వ బడుల ప్రతిష్ట పెంచే బాధ్యత టీచర్లదే. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో విద్యార్థులను కలిసి సమస్యలు తెలుసుకోవాలి. నవంబర్ 14 నుంచి డిసెంబర్ 7 వరకు విజయోత్సవాలు నిర్వహిస్తున్నాం. అనుకున్న విధంగా బాలల దినోత్సవం రోజున ఉత్సవాలు ప్రారంభించాం అన్నారు. అధికారులు జిల్లాల్లో రెండు రోజుల పాటు పాఠశాలలను పర్యవేక్షించాలి. విద్యార్థుల సమస్యలు తెలుసుకోవాలి. హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యంతో మంచి అన్నం పెట్టాలి. దొడ్డు బియ్యం, కుళ్లిన కూరగాయలతో భోజనం పెడితే ఊరుకునేది లేదన్నారు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకపోతే జైలుకు పంపుతాం. గత సీఎంను ఏనాడైనా మీరు చూశారా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులను ఏనాడైనా చూశారా? ఈ రోజు మీ రేవంత్ అన్న మీతో చేయి కలిపాడా.. లేదా? దేశానికి ఆదర్శంగా ఉంటామని.. ఎలాంటి చెడు వ్యసనాలకు బానిసలు కాబోమని విద్యార్థులు ప్రమాణం చేయాలని సీఎం కోరారు. ప్రభుత్వ హాస్టల్స్, గురుకులాల్లో ఇటీవల జరుగుతోన్న ఫుడ్ పాయిజన్ ఘటనలపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. విద్యార్థులు తినే ఆహారంలో కల్తీ జరుగుతోంది. విద్యార్థులు తినే భోజనంలో పురుగులు, బల్లులు వస్తున్నాయి. ఇక నుండి హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం పెట్టకపోతే జైలుకు పంపుతాం. విద్యార్థులకు గ్రీన్ ఛానెల్ ద్వారా కాస్మోటిక్ ఛార్జీలు ఇవ్వాలి. విద్యార్థులకు సన్నబియ్యంతో మంచి ఆహారం పెట్టాలి. ముఖ్యమంత్రి, మంత్రులు తినే సన్న బియ్యమే గురుకులాల విద్యార్థులకు భోజనం పెడుతున్నాం. ఎక్కడైనా విద్యార్థులకు దొడ్డు బియ్యం, కుళ్లిన కూరగాయలతో భోజనం పెడితే ఊరుకోం' అని సీఎం రేవంత్ రెడ్డి స్టాం÷-రగ్ వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్రంలో 60 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని.. ఈ విద్యార్థులే రాష్ట్ర భవిష్యత్ అన్నారు. ఇందులోనే కాబోయే ఇంజనీర్లు, డాక్టర్లు, ముఖ్యమంత్రులు ఉన్నారన్నారు. ఈ వేదికగా మీ కళల్ని ప్రదర్శించే అవకాశం నాడు ఇచ్చారా..? కానీ మీ రేవంత్ అన్న మిమ్మల్ని కలుసుకున్నాడు.. మీతో ఉన్నాడని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఫామ్ హౌస్‌లో పడుకున్న కేసీఆర్‌కు వినపడేలా విద్యార్థులు చప్పట్లు కొట్టాలని ఈ సందర్భంగా స్టూడెంట్స్‌కు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. పండగ పేరుతో సారా బుడ్లతో దొరికిన వారికి శిక్ష తప్పదని పరోక్షంగా కేటీఆర్‌ను హెచ్చరించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మా భూమి అని చెప్పి..
# ఫోర్ట్ సిటీ కోసం యత్నం

(మొదటి తరువాయి)

సిటీ అంటున్నారని కేటీఆర్ విమర్శించారు.తెలంగాణ భవన్‌లో గురువారంమీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణ భవన్‌కు లగచర్ల భూసేకరణ గిరిజన కుటుంబాలు చేరుకున్నాయి. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉంటానని కేటీఆర్ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి సీట్ కోసం మంత్రులు ఎదురుచూస్తున్నారని కేటీఆర్ విమర్శలు చేశారు. నల్గొండ ,ఖమ్మం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి , మల్లు భట్టి విక్రమార్క సీఎం చైర్ కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ముందుగా తన సీట్ పోకుండా రేవంత్ రెడ్డి చూసుకోవాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో భూముల ధరలు పెరిగాయని అన్నారు. ఏమైనా అభివృద్ధి చేస్తారేమోనని ప్రజలు అనుకుంటున్నారని అన్నారు. 'లగుచర్ల ఇష్యూతో సర్కారు బంగపడింది. లగచర్లలో అరెస్టు అయిన వారిని పోలీసులు తీవ్రంగా కొట్టారు. కాంగ్రెస్ కార్యకర్తలను వదిలి పెట్టి బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేశారు . పోలీసులు ఘోరంగా ప్రవర్తిస్తున్నారు. మా నాయకుడు సురేష్ తప్పేం చేశారు. నరేందర్ రెడ్డినీ ఎందుకు అరెస్టు చేశారు. నాలుగేళ్లలో మేమే అధికారంలోకి వస్తాం. ఆంధ్రలో ఏం జరిగిందో తెలంగాణలో అదే జరుగుతది. బీఆర్ఎస్ నేతలపై బోగస్ కేసులు పెడుతున్నారు. అధికారులకు అంత స్వామి భక్తి పనికి రాదు. రేవంత్ పిచ్చోడు.. అసలు వదలం. బాధితులను ఢిల్లీకి తీసుకెళ్తాం. నేషనల్ హెచ్‌ఆర్‌సీలో ఫిర్యాదు చేస్తాం అని కేటీఆర్ హెచ్చరించారు.

## తెలంగాణ అభివృద్ధికి వ్యతిరేకంగా
# కాంగ్రెస్, బీఆర్ఎస్

(మొదటి తరువాయి)

రాష్ట్రానికి వస్తే స్వాగతం పలకలేని మొఖాలు ఇవాళ మేమేం చేయాలో చెప్తయా.. అని కిషన్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్ సర్టిఫికేట్ మాకు అక్కర్లేదని అన్నారు.గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లిస్తోందని విమర్శించారు. అందుకే బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని ప్రచారం చేస్తోందని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని... గవర్నర్ ఏ నిర్ణయం తీసుకోవాలన్నా లీగల్ ఒపీనియన్ తీసుకోవాల్సి ఉంటుందని ఈ క్రమంలో కొంత జాప్యం జరిగితే తొందరపాటుగా వ్యాఖ్యలు చేయడం సరికాదని, అంతమాత్రాన బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే చెప్పడం అవివేకమని కిషన్ రెడ్డి అన్నారు. అవినీతి ఎక్కడ జరిగినా విచారణ జరపాలన్నది తమ డిమాండ్ అని అన్నారు. కాళేశ్వరం మీద సీబీఐ విచారణకు డిమాండ్ చేశామని, సీఎం రేవంత్ రెడ్డి విచారణ కోరారా.. అని ప్రశ్నించారు. గవర్నర్ నిర్ణయం తీసుకోవాలంటే లీగల్ ఒపీనియన్ అనేది ఉంటుందని చెప్పారు. అమృత్ టెండర్లపై జరిగిన అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ తామే కోర్టుకు వెళ్లామని గుర్తు చేశారు. ప్రజలతో తప్ప ఏ పార్టీతో బీజేపీ ములాఖత్ కాలేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని సీరియస్ అయ్యారు. వైఫల్యాలను, అసమర్థత నుంచి దృష్టి మళ్లించేందుకు రెండు పార్టీలు పోటీ పడుతున్నాయని, కేటీఆర్, కేసీఆర్ ఇచ్చే సర్టిఫికెట్లు తమకు అవసరం లేదని కిషన్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రధాని మోదీ తెలంగాణకు వచ్చి ప్రాజెక్టులు ప్రారంభించడానికి వస్తే బయటకు రాని కేసీఆర్, కేటీఆర్‌కు మాట్లాడే అర్హత లేదన్నారు. కలెక్టర్ మీద దాడి తప్పు అని.. కానీ గ్రామస్తులపై అక్రమ కేసులు పెట్టడం కూడా సరికాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలో జరిగిన ఘటన అని, ఆయన తన ప్రజలతో మాట్లాడాలని కిషన్ రెడ్డి సూచించారు. మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లలో బీజేపీ అధికారంలోకి రాబోతుందని, ఒక్క అవినీతి, కుంభకోణం ఆరోపణ లేకుండా బీజేపీ, శివసేన ప్రభుత్వ పాలన సాగిందని కిషన్ రెడ్డి అన్నారు. ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో బొగ్గు శాఖ, గనుల శాఖ విడివిడిగా పెవిలియన్లు ఏర్పాటు చేశామన్నారు. కోల్ ఇండియా ప్రపంచంలోనే 3వ అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారని, ఇది ఏర్పాటు చేసి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామన్నారు. బొగ్గు వెలికితీత ముగిసిన తర్వాత ఆ గనులను పర్యావరణానికి, ప్రజలకు ఉపయోగపడేలా ఎలా తీర్చిదిద్దాలి అన్న విషయంపై పనిచేస్తున్నామని చెప్పారు. బొగ్గు పరిశ్రమలో ప్రమాదాలు లేకుండా కార్మికుల క్షేమమే ప్రధాన ఎజెండాగా కార్యక్రమాలు రూపొందించామన్నారు. వచ్చే ఏడాది అక్టోబర్ వరకు కోల్ ఇండియా ఫౌండేషన్ డే ఉత్సవాలు

# రైతుల ముసుగులో గులాబీ గుండాల అరాచకం

(మొదటి తరువాయి)

రైతాంగం అర్థం చేసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజలను కాపాడుకున్నట్లే, అధికారులను కాపాడుకోలేకపోతే పని చేయడానికి ఏ అధికారి ముందుకు వస్తారని ప్రశ్నించారు. గురువారం గాంధీభవన్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియా తో మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా ఇదే పద్ధతి పాటించారా అని నిలదీశారు. రైతులను నష్టపెట్టాలన్నది తమ ప్రభుత్వ ఉద్దేశం కాదని మంత్రి పొంగులేటి అన్నారు. వారి సమస్యలను వినడానికి, పరిష్కరించడానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందని తెలిపారు. రైతుల ముసుగులో అధికారులను చంపే ప్రయత్నం చేయడం మంచి పద్ధతి కాదని అన్నారు. లగచర్ల సంఘటను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని అన్నారు. ఈ రోజు అధికారులపై దాడి జరిగినట్లుగానే ..రేపు రాజకీయ



నాయకులు, ప్రజలపై దాడి జరిగితే ప్రభుత్వం ఉపేక్షించదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. వికారాబాద్ జిల్లాకు ఫస్ట్ మేజిస్ట్రేట్‌గా ఉన్న కలెక్టర్‌పైనే హత్యాయత్నం చేయడానికి కుట్ర పన్నారని ఆరోపించారు. అధికారుల మీద దాడి జరగడం మనమీద మనం దాడి చేసుకునట్లేనని అన్నారు. ఏం తప్పుచేశారని ఆనాడు ఖమ్మంలో మిర్చి రైతులకు సంకెళ్లు వేసి జైల్లో పెట్టారని ప్రశ్నించారు. మల్లన్నసాగర్‌లో రైతులను దేశద్రోహులుగా చిత్రీకరించారని ఆరోపించారు. పిల్లా, పాపా, ముసలి అనే తేడా లేకుండా రాత్రికి రాత్రి వారిని అరెస్ట్ చేసి సంకెళ్లు వేసిన సంగతి మరిచారా అని ప్రశ్నించారు. కేటీఆర్ నియోజకవర్గం సిరిసిల్లలో దళితులకు బేడీలు వేసిన సంగతి మరిచిపోయారా అని నిలదీశారు. లగచర్లలో ఆ పరిస్థితి లేదు కదా అని మంత్ర పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు.

# జార్ఖండ్‌లో బీజేపీదే అధికారం

(మొదటి తరువాయి)

ఝార్ఖండ్‌లో మలివిడత ఎన్నికల ప్రచారం సందర్భంగా దుమ్రిలో ఏర్పాటు చేసిన సభలో అమిత్ షా ప్రసంగించారు. అధికార దురాశ వల్లే ఝార్ఖండ్ ఏర్పాటును వ్యతిరేకించిన ఆర్జేడీ -కాంగ్రెస్ ఒడిలో హేమంత్ సోరెన్ కూర్చోవాల్సి వచ్చిందని మండిపడ్డారు. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమన్న అమిత్ షా.. ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని ఉగ్రవాదం నుంచి విముక్తి చేశారన్నారు. ఝార్ఖండ్‌లో చొరబాట్లను హేమంత్ సర్కార్ ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే చొరబాటుదారులను బహిష్కరిస్తామన్నారు. అనేక పరిశ్రమలు నెలకొల్పి.. ఒక్క యువకుడు కూడా వలస వెళ్లకుండా చూస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. హేమంత్ సోరెన్ గతంలో నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీని సైతం నెరవేర్చలేదన్నారు. భాజపా అధికారంలోకి వస్తే.. యువతకు నెలకు రూ.2వేలు నిరుద్యోగ భృతి కల్పించడంతో పాటు 2లక్షలకు పైగా ఖాళీ ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు.

# అధికారం కోల్పోవడంతో రెచ్చగొట్టే యత్నాలు

(మొదటి తరువాయి)

చెప్పాలని భట్టి ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మీడియాతో భట్టి మాట్లాడారు. 'నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడమే ప్రభుత్వ వైఫల్యమా అని నిలదీసారు. రైతు రుణమాఫీ చేయడం వైఫల్యమా అని నిలదీసారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పెట్టడం ప్రభుత్వ వైఫల్యమా? ఫార్మా క్లస్టర్స్ విస్తరణను వ్యతిరేకించడం బుద్ధి తక్కువ పని అన్నారు. కక్షపూరిత రాజకీయాలకు మేం వ్యతిరేకం అన్నారు. ప్రతిపక్షంగా భారాస తన పాత్ర పోషించిందా చెప్పాలని నిలదీశారు. కులగణన చేస్తామని మాట ఇచ్చాం. దాని ప్రకారం చేసి చూపిస్తున్నాం. ఇది విప్లవాత్మక నిర్ణయం.. రాష్ట్రాభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుంది. దేశానికి తెలంగాణ రోల్ మోడల్ కాబోతుంది. అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకునే ప్రశ్నలు తయారు చేశాం అని భట్టి విక్రమార్క అన్నారు.

# ప్రభుత్వంపై కొడంగల్ నుంచే వ్యతిరేకత



(మొదటి తరువాయి)

గుంజుకుంటున్నాడని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. లగచర్ల కేసులో అరెస్టయిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని హరీశ్‌రావు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్ పగ ప్రతీకారంతో పట్నంను కుట్రపూరితంగా నరేందర్‌రెడ్డిని అరెస్ట్ చేయించారని ఆరోపించారు. కొడంగల్ నుంచే ప్రజాపాలన మీద తిరుగుబాటు మొదలైందని.. ఈ అరెస్ట్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. మీకు ఓటేస్తే మేలు జరుగుతుందనుకుంటే పాపానికి.. లగచర్ల గ్రామం భూములను గుంజుకోవడమే నువ్వు చేసే మేలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు అబద్దాలు మాట్లాడుతున్నారన్నారు. ఎక్కడ ఏం జరిగినా బీఆర్ఎస్‌పై పెడుతున్నారన్నారు. నిరుద్యోగులు, రైతులు, పోలీసులు స్వచ్ఛందంగా ధర్నా చేస్తే అది బీఆర్ఎస్ చేయించిందని రేవంత్ అంటున్నారని.. రేవంత్ సొంత నియోజకవర్గంలో తమ భూముల కోసం గిరిజనులు పోరాటం చేస్తే అది కూడా బీఆర్ఎస్ చేసిందనే అంటున్నారన్నారు. ప్రజలకు అన్యాయం జరిగితే పోరాడడం ప్రతిపక్షాలుగా మా బాధ్యత అన్నారు. మమ్మల్ని అక్రమంగా కేసులు పెట్టాలనుకుంటున్నావేమో .. మాపై కోపం ఉంటే మమ్మల్ని అరెస్ట్ చేయండి.. కానీ అమాయక గిరిజన రైతులపై కేసులెలా పెడతారని సీఎంని ప్రశ్నించారు. వెంటనే గిరిజన రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా ..? ప్రజాస్వామ్యమెక్కడుంది అంటూ నిలదీశారు. మల్లన్నసాగర్‌లో రేవంత్ రెండురోజులు నిరసన చేస్తే మేం అడ్డుకున్నమా.. ? అని ప్రశ్నించారు. అర్ధరాత్రి మహిళల చాతీమీద కాళ్లు పెట్టి అరెస్టులు చేయడం సరికాదన్నారు. ఈ ప్రజల తిరుగుబాటు ఆగదని.. రేవంత్‌ని గద్దె దించే దాకా నిద్రపోమన్నారు. మా ప్రభుత్వంలో 14వేల ఎకరాలు ఫార్మాసిటీ కోసం సేకరించామని.. అక్కడెందుకు ఫార్మాసిటీ కట్టరని ప్రశ్నించారు. ఇందిరమ్మ ముసుగులో దళితుల, గిరిజనుల భూములు గుంజుకుంటున్నారని.. ఇందిరమ్మ ఎమర్జెన్సీ పాలన ఇప్పుడు కనిపిస్తోందన్నారు. రైతుల భూములు గుంజుకోవడమే ఇందిరమ్మ పాలన అని నిలదీశారు. రేవంత్ పాలన అదానీ, తమ్ముళ్లు, అల్లుళ్ల కోసమేనని.. బీఆర్ఎస్ పార్టీ దళిత, గిరిజనుల పక్షాన నిలబడుతుందని స్పష్టం చేశారు. కేటీఆర్‌పై సైతం కుట్రలు చేస్తున్నారని.. ఆ రోజు మల్లన్నసాగర్‌లో నీ మీద కేసులు పెట్టినమా అంటూ సీఎం రేవంత్‌ను హరీశ్‌రావు ప్రశ్నించారు. ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించామని.. నరేందర్ రెడ్డికి ఏ సంబంధం లేదన్నారు. రిమాండ్ రిపోర్ట్‌లో ఏముందో తెలియదని.. మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచడానికి ఒక్క నిముషం ముందు ఒత్తిడి చేసి నరేందర్‌రెడ్డితో సంతకం చేయించారని ఆరోపించారు. రేవంత్ రెడ్డికి బడాబాబులపై ప్రేమ ఉందన్నారు. నరేందర్‌రెడ్డి ధైర్యంగా ఉన్నారని.. ఆయనకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందన్నారు. ధర్మమే గెలుస్తుందని.. న్యాయస్థానంలో తమకు న్యాయం జరుగుతుందన్నారు. ఆయన నిర్దోషిగా బయటకు వస్తారన్నారు.

## జీతాల వివాదం - సింబయాసిస్ యూనివర్సిటీ ఎదుట ధర్నా




నందిగామ, నవంబర్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)
రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మోదల్లగూడలోని సింబయాసిస్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయంలో కాంట్రాక్టు కార్మికులు జీతాల విషయంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. వేతనాలు సకాలంలో అందడం లేదని ఆవేదన చెందుతూ యూనివర్సిటీ ముందు నిరసనకు దిగారు. పనిచేసే కార్మికులకు నిత్యం జీతాలు ఆలస్యం కావడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని వారు ఆరోపిస్తున్నారు. తమకు నెల నెలా జీతాలు క్రమంగా చెల్లించాలని, సంబంధిత అధికారులు సమస్యపై స్పందించి తక్షణమే పరిష్కారం చూపాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై యూనివర్సిటీ ప్రతినిధులు, కాంట్రాక్టర్ నుండి ఇంకా ఎలాంటి స్పందన రాకపోవడంతో, కార్మికులు తమ నిరసనను కొనసాగిస్తామని హెచ్చరించారు.

## ఎలిమినేడు భూ పోరాట సమితి అధ్యక్షుడు అరెస్టు

ఇబ్రహీంపట్నం, నవంబర్ 13 (నీలగిరి ఎక్స్ ప్రెస్)
రంగారెడ్డి జిల్లా ఎలిమినేడు భూ పోరాట సమితి అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డిని ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్టు చేశారు. గతంలో నష్టపరిహారం సరిగా అందలేదని జాతీయ ఎస్సీ కమిషన్కు ఫిర్యాదు చేసిన రైతులు, ఈరోజు కమిషన్ కలెక్టర్ ఆఫీస్ కు విచ్చేయు సందర్భంలో ఈ అరెస్టులు చోటుచేసుకున్నాయి. టిఆర్ఎస్ ప్రభుత్వంలో 600 ఎకరాల భూమిని వివిధ కంపెనీల కోసం ప్రభుత్వం ఇచ్చిన ఎలిమినేడు గ్రామ రైతులు, తగిన నష్టపరిహారం ఇవ్వలేదని గత కొద్ది కాలంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ ఎస్టీ కమిషన్ ఈ భూముల గురించి జిల్లా కలెక్టర్ దగ్గరికి విచ్చేసిన సందర్భంలో, ఈ అరెస్టులు జరిగినట్టు సమాచారం.


### ఏడుపాయల వన దుర్గమ్మను దర్శించుకున్న అఘోరీ



మెదక్ నవంబర్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్):
మారిన అఘోరీ మాత గురువారం మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గా ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అఘోరీని చూసేందుకు, ఆమె ఆశీర్వాదం తీసుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం హిమాలయాలను వదిలి దేశంలో పర్యటిస్తున్నానని చెప్పిన అఘోరీ తన మాటలు, చర్యలతో వివాదస్పద మయ్యారు. కొద్ది రోజులుగా ఏపిలోని శైవ క్షేత్రాలను సందర్శించిన ఆమె ప్రస్తుతం తెలంగాణలో పర్యటిస్తున్నారు.మహిళలపైన, దేవాలయాలపైన దాడులు ఆపకపోతే తెలంగాణ ప్రభుత్వానికి శివతాండవం చూపిస్తానంటూ, అత్యాచారాలకు పాల్పడే వారి అంగాలను ఖండిస్తామంటూ హెచ్చరికలు చేశారు. అఘోరీ తొలుత తమిళనాడు నుంచి తెలంగాణకు, ఇక్కడి నుంచి కేదరినాథ్ కు, మళ్లీ తెలంగాణకు, ఇటు నుంచి కార్తీక మాసం శైవ క్షేత్రాల సందర్శన పేరుతో ఆంధ్రప్రదేశ్ లో పర్యటించి, మళ్లీ తెలంగాణకు చేరుకుని తన చర్యలతో నిత్యం వార్తల్లో నిలుస్తున్నారు.

### శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి
### రామగుండం సీపీ శ్రీనివాస్ ప్రత్యేక పూజలు

-మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసిన మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఒగ్గు కిషోర్



షాద్ నగర్, నవంబర్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్) :
షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫరూఖ్ నగర్ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని అర్చకులు వేద మంత్రాలతో పూజలు నిర్వహించారు. అనంతరం రామగుండం కమీషనర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్ ను శాలువాతో సన్మానించి ఆశీర్వదించారు. షాద్ నగర్ పట్టణానికి చెందిన మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఒగ్గు కిషోర్ మర్యదపూర్వకంగా కమిషనర్ ను కలసి పుష్పగుచ్ఛం అందించారు..

# యువత వ్యాపారంలో రాణించాలి

– టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్



హైదరాబాద్, నవంబర్ 13 (నీలగిరి ఎక్స్ ప్రెస్)
నిరుద్యోగ యువత ఉద్యోగాలు రాలేదని సమయం వృధా చేయకుండా అనుభవం కలిగిన వ్యాపారంలో రాణించాలని టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం మైసిగండి వాసి కేతావత్ సక్కు నాయక్ బిఎన్ రెడ్డి నగర్, హైదరాబాద్ లో నూతనంగా ఏర్పాటు చేసిన స్నేహ ఫ్రెష్ చికెన్ లైవ్ ఫిష్ షాప్ ను ఆయన ప్రారంభించారు. "మనం ఉన్న చోట వ్యాపారం చేయని పక్షంలో, వ్యాపారం ఉన్న చోట, హైదరాబాద్ లాంటి నగరాల్లో భవిష్యత్ ను రూపుదిద్దుకోవాలి. వివిధ వ్యాపార రంగంలో అనుభవం ఉన్న వారు పోటీ తత్వంతో తమ తమ వ్యాపారాల్లో రాణించాలని, ప్రభుత్వం ప్రోత్సాహకం కూడా వినియోగించుకోవాలి. స్కిల్స్ ఉన్న వారు టెక్నికల్ మార్గంలో రాణించాలని" శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సక్రి సోమ్లా నాయక్, గంగా, కృష్ణా నాయక్, రాము నాయక్, రాందాస్ నాయక్, సుమన్, హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

### ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్ నగర్ నవంబర్ 14,(నీలగిరి ఎక్స్ ప్రెస్)
అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహా నిధి ద్వారా మంజురైన ఆర్థిక సహాయాన్ని(చెక్కులు) షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారు పంపిణీ చేశారు. కొత్తూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి మండలానికి సంబంధించిన 34 మంది లబ్దిదారులకు 13,08,500 రూపాయల చెక్కులను అందచేశారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు పట్టణ పార్టీ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, కొత్తూరు మండల అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి నందిగామ మండల అధ్యక్షుడు జంగా నరసింహులు, మాజీ ఎంపీటీసీలు కుమార స్వామి గౌడ్, కొమ్ము కృష్ణ, కొత్తూరు ఎంపీడీవో , కొత్తూరు తాహసిల్దార్, ఉమ్మడి మండలానికి సంబంధించిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

### వెలుముల పల్లిలో కుటుంబ సమగ్ర సర్వేలో పాల్గొన్న వంగూరు మండల ఎమ్మార్వో



వంగూరు, నవంబర్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్)
వంగూరు మండల పరిధిలోని వెలములపల్లి గ్రామంలో కుటుంబ సమగ్ర సర్వేను స్థానిక వంగూరు మండల ఎమ్మార్వో మరియు డిప్యూటీ తహసిల్దార్ వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్వేలో ప్రజల ఎడల నిర్లక్ష్య ధోరణి అవలంబించకుండా ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, కుటుంబ సర్వే నమోదు చేయాలని సర్వే అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. మండల ఎమ్మార్వో, సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించవలసిందిగా ప్రజలకు వివరించారు. ప్రజలు సిబ్బందికి సహకరిస్తే సర్వేను త్వరగా పూర్తి చేయగలమని స్థానిక మండల ఎమ్మార్వో పేర్కొన్నారు.

# బిజెపి సంస్థాగత ఎన్నికలకు సిద్ధం కండి

-కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కమ్మరి భూపాలచారి



కొందుర్గు 14, నవంబర్(నీలగిరి ఎక్స్ ప్రెస్)
భారతీయ జనతా పార్టీ సంస్థాగత పర్వ్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలో మండల సభ్యత్వ ప్రముఖ్ చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి అధ్యక్షతన మండల క్రియాశీల సభ్యుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమ్మరి భూపాల చారి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిజెపి సభ్యత్వ నమోదు ముగింపు దశకు చేరుకున్న సందర్భంగా గ్రామాలలో బూత్ కమిటీల నిర్మాణానికి నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. భారతీయ జనతా పార్టీ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించిన సందర్భంగా నరేంద్ర మోడీ గారి నాయకత్వంలో భారత్ నలువైపులా అన్ని రంగాలలో అభివృద్ధి దిశలో పయనిస్తుందని, ప్రపంచ దేశాలకు భారత్ దిక్సూచిగా మారనుందని పేర్కొన్నారు. ఇంకా క్రియాశీల సభ్యత్వం పొందాలనుకునేవారు వేగంగా సభ్యత్వ నమోదును చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బోయ శంకర్, బలవంత రెడ్డి, ఈసరి సత్యనారాయణ, పసుపుల ప్రశాంత్, సత్యనారాయణ రెడ్డి, బోయ అశోక్ శ్రీనివాస్, యాదయ్య, మల్లేష్, సురేష్, రవి, గోపాల్, సత్యం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



తారామతిపెట్, నవంబర్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్)
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తారామతిపెట్‌లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా, విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు చెప్పడంతో పాటు, కలెక్టర్, డీఈవో, ఎంఈవోలుగా పాఠశాలకు రావడం పలువురిని ఆకట్టుకుంది. బాలల దినోత్సవం సందర్భంగా, విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి చక్కగా పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా లాహరి, డీఈవోగా లక్కీ, ఎంఈవోగా శరణ్య పాఠశాలను సందర్శించి పరిశీలించడం, తనిఖీలు చేయడం ఆకట్టుకుంది. పాఠశాల హెచ్‌ఎంగా జశ్వంత్ తో పాటు ఇతర విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు.
GHM ప్రసాద్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎర్రయ, జ్యోతి, మహిపాల్, రమేశ్ రావు, వెంకట్ రాంరెడ్డి, నాగజ్యోతి, నరసింహారెడ్డి, రమేష్, యాదమ్మ, మహేందర్, పరశు రాం, కిరణ్ కుమారి, నరసింహారావు, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ఎరుకల సుమలత పాల్గొన్నారు.

# యూనిక్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో ఘనంగా చాచా నెహ్రూ జయంతి వేడుకలు

-ముఖ్య అతిథులుగా బుగ్గారెడ్డి హాస్పిటల్స్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి, జియాన్ స్కూల్ కరస్పాండెంట్ ల సుధాకర్ రెడ్డి

-నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు

-విద్యార్థిని విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన అనురాగ్ రెడ్డి



షాద్ నగర్ నవంబర్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్ ): రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం లోని పరిగి రోడ్డు లో ఉన్న యూనిక్ ఇంగ్లీష్ మీడియా స్కూల్ ప్రిన్సిపాల్ నరేందర్, అనురాధ అధ్యర్యంలో స్కూల్ లో భారతదేశ మొదటి ప్రధానమంత్రి, చిన్నారి పిల్లలపై ఎనలేని ప్రేమాభిమానాలు కలిగిన వ్యక్తిగా, తన జన్మదినోత్సవాన్ని బాలల దినోత్సవం గా జరిపెంతటి మహోన్నత వ్యక్తి పండిత్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బుగ్గారెడ్డి హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ అనురాగ్ రెడ్డి, జియాన్ స్కూల్ కరెస్పాండెంట్ సుధాకర్ రెడ్డిలను స్కూల్ యాజమాన్యం ఆహ్వానించింది. పండితు జవహర్లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా పురస్కరించుకొని స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, విచ్చేసిన ఆహ్వానితులు జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరము విద్యార్థిని విద్యార్థులు ముఖ్య అతిథులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా బుగ్గారెడ్డి హాస్పిటల్ అనురాగ్ రెడ్డి మాట్లాడుతూ ముందుగా విద్యార్థిని విద్యార్థులకు బాలల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ, స్వచ్ఛమైన మనసు గల విద్యార్థిని విద్యార్థులు తమ ఆరోగ్యాలను మంచిగా ఉంచుకోవాలని, చదువులు బాగా చదవాలి, మీరు బాగా చదివి ఎదగాలి అంటూ, అన్నింటికంటే ముఖ్యమైనది పెద్దలపట్ల వినయ విధేయతలు గౌరవం కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో స్కూల్ ఉపాధ్యాయ బృందం, మరియు విద్యార్థుల తల్లిదండ్రులు, చిన్నారి విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ



విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్

కడ్తాల్, నవంబర్ 14(నీలగిరి ఎక్స్ కడ్తాల్ మండల సమీపంలో ఉన్న కస్తూరిబా రెసిడెన్షియల్ పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 220 మంది బాలికలకు స్టీల్ ప్లేట్లను ట్రస్ట్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ స్థానిక నాయకులతో కలిసి ప్రధానోపాధ్యాయులు అనిత ఉపాధ్యాయుల సమక్షంలో బాలికలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ దశరథ్ నాయక్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు కావాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని భవిష్యత్తును ఉన్నత స్థానంలో నిలవాలని వారన్నారు. అనంతరం సరదాగా విద్యార్థులతో కాసేపు వారి సాధకబాధకాలను పంచుకున్నారు. విద్యార్థుల ఎలాంటి ఇబ్బందులు వచ్చిన తీర్చడానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఉందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, మాజీ వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్, మాజీ సర్పంచ్ గుడురు లక్ష్మీనరసింహారెడ్డి, పాఠశాల ఎస్ఓ అనిత, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు, డైరెక్టర్ సేవ్య నాయక్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ లాయక్ అలీ, నాయకులు మంగళపల్లి నరసింహ లక్ష్మణాచారి పాండు రామచంద్రయ్య వెంకటేష్ శ్రీకాంత్ శ్రీను రాజు జగన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండ ఆర్టీసీ డిపోలో "డయల్ యువర్ డీఎం"



నల్లగొండ, నవంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) దేవరకొండ ఆర్టీసీ డిపో కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుండి 4 గంటల వరకు "డయల్ యువర్ డీఎం" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దేవరకొండ డిపో మేనేజర్ తల్లాడ రమేష్ బాబు తెలిపారు. దేవరకొండ డిపో పరిధిలో ఆర్టీసీ బస్సులకు సంబంధించిన ఏమైనా సూచనలు, సలహాలు లేదా సమస్యలను తెలియజేయాలనుకున్నవారు సెల్ నంబర్: 9959226311కు డయల్ చేయవలసిందిగా కోరారు.

## మధుమేహ దినోత్సవం, బాలల దినోత్సవం సందర్భంగా పల్లె దవాఖానలో ప్రత్యేక కార్యక్రమాలు





వెల్దండ, నవంబర్ 14 (నీలగిరిఎక్స్ప్రెస్) వెల్దండ మండల పరిధిలోని బైరాపూర్ గ్రామంలోని పల్లె దవాఖానలో మధుమేహ దినోత్సవం సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయి పవన్ నాయక్ మాట్లాడుతూ, "మధుమేహం వ్యాధి కాదని, గ్లూకోస్ స్థాయిల హెచ్చుతగ్గుల వల్ల వచ్చే పరిస్థితి మాత్రమే" అని వివరించారు. ఆయుష్మాన్ ఆరోగ్య సివార్ పథకం కింద పల్లె దవాఖానలో మధుమేహ పరీక్షలు నిర్వహించి, మధుమేహ బాధితులకు ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ సాయి పవన్ నాయక్ గ్రామ ప్రజలకు ఆరోగ్య సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా, బాలల దినోత్సవం సందర్భంగా స్కూల్ విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్లు, రబ్బర్లు పంచిపెట్టారు. డాక్టర్ మాట్లాడుతూ, "బాలలే రేపటి పౌరులు. వారిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ముఖ్యమైనది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్త చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతం

షాద్‌నగర్, నవంబర్ 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్) సత్యదేవ కాలని ప్రాంతంలోని శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి దేవాలయంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా ఈ నెల 15వ తేదీ శుక్రవారం ఉదయం 10:00 గంటలకు స్వామివారి సామూహిక వ్రతం వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ వివరాల ప్రకారం, వ్రతం అనంతరం మధ్యాహ్నం 12:00 గంటలకు మహా నివేదన, 12:30 గంటలకు తీర్థ ప్రసాద గోష్టి, అనంతరం అన్న ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ప్రధాన అర్చకులు కానుకుర్తి రాఘవేంద్రాచార్యులు భక్తులను ఆహ్వానించారు.




ఫరూక్ నగర్ మండలం విట్యాల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా చాచా నెహ్రూ వేషధారణలో అలరించిన చిన్నారులు



బాలల దినోత్సవం సందర్భంగా చాచా నెహ్రూ వేషధారణలో ఆమనగల్లు పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ స్కూల్ విద్యార్థులు విడియాల సాయి నిహాస్,విడియాల సాయి సాకేత్.

## వంగూరులో బాలల దినోత్సవం

- విద్యార్థులకు పాఠాలు






వంగూరు, నవంబర్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్) వంగూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక బాలికల ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం లలిత, లింగమయ్య, రమేష్, అనిత హాజరై బాలలతో కలిసి ఈ ఉత్సవాలను నిర్వహించారు. ఉపాధ్యాయుడు రమేష్ మాట్లాడుతూ, "ఈనాటి బాలలే రేపటి పౌరులు" అని, భారతదేశానికి తొలి ప్రధానమంత్రి భారతరత్న జవహర్లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా, విద్యార్థుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు కోసం పునాదులు వేసినట్లు అవుతుందని వివరించారు. విద్యార్థులు మంచి నడవడిక ఏర్పరచుకోవాలని, ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉపాధ్యాయులు సలహా ఇచ్చారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో పని చేయాలని కూడా పేర్కొన్నారు.

## ఘనంగా జవహర్ లాల్ నెహ్రూ జయంతి కార్యక్రమం

జయంతి వేడుకల్లో పాల్గొన్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్ నగర్ నవంబర్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్ ): భారత ప్రథమ ప్రధానమంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ జయంతి వేడుకలు గురువారం షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. భారతదేశానికి స్వాతంత్రానంతరం సుదీర్ఘకాలం ప్రధానమంత్రిగా పనిచేసి పంచవర్ష ప్రణాళికలను తీసుకువచ్చి దేశ అభివృద్ధి లో కీలకపాత్ర పోషించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంకళ్ళ చెన్నయ్య, బస్వం అప్ప, దంగు శ్రీనివాస్ యాదవ్, యాదగిరి యాదవ్,మురళీ మోహన్ (అప్పి), ఇబ్రహీం, మాధవులు, జంగారి రవి, నరసప్ప గూడ కృష్ణ, సీతారాములు, సత్తయ్య,ఖదీర్, జగదీష్,మనీష్ తదితరులు పాల్గొన్నారు.

## వెల్దండలో బీజేపీ కార్యాచరణ వర్క్ షాప్



వెల్దండ, నవంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) వెల్దండ మండలంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఎన్నికల్లో భాగంగా కార్యాచరణ వర్క్ షాప్ నిర్వహించారు. వెల్దండ బీజేపీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా సంస్థాగత ఎన్నికల కన్వీనర్ మొగిలి దుర్గాప్రసాద్ హాజరయ్యారు. ఎన్నికల్లో అనుసరించవలసిన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, అప్పుడే సంస్థాగత ఎన్నికల్లో పాల్గొంటే అనుకూల ఫలితాలు వస్తాయని ఆయన వివరించారు. ప్రతి బీజేపీ కార్యకర్త ప్రజలతో అనునిత్య సంబంధాలు కలిగి ఉండడం వలన అనుకూల ఫలితాలు రావడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ప్రతి కార్యకర్త గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు నీరు గంటి రాఘవేందర్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ ఎన్నం శేఖర్ రెడ్డి, మండల అధ్యక్షుడు కురుమిద్ద యాదగిరి, బాలస్వామి, జంగయ్య యాదవ్, రాజేందర్ రెడ్డి, మోహన్ రెడ్డి, శ్రీనివాస చారి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## మిడ్జిల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**- యువకుడు మృతి**



మిడ్జిల్, నవంబర్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్)

మిడ్జిల్ మండల పరిధిలో జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఉర్కొండ మండలం లోముచ్చర్లపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ఉపాధి రీత్యా పోలేపల్లి సెజ్‌లో ఉద్యోగం చేసేవాడు. ప్రతిరోజు పోలేపల్లికి వెళ్లి తిరిగి వస్తుండేవాడు. అనుకోకుండా గురువారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.


## మాచర్ల గ్రామంలో శివ స్వాములకు వంట సామాగ్రి అందజేత




కల్వకుర్తి, నవంబర్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్)

కల్వకుర్తి మండల పరిధిలోని మాచర్ల గ్రామంలో గురువారం శివ స్వాములకు వంట సామాగ్రి వస్తువులను అందజేశారు. మాచర్ల గ్రామానికి చెందిన ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కాయితి ఆశాజీత్ రెడ్డి సహకారంతో, శివ స్వాములకు వంట సామాగ్రి కావాలని కోరడంతో, ఆశాజీత్ రెడ్డి సానుకూలంగా స్పందించి వెంటనే వంట సామాగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో, మాచర్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకొని ధన్యవాదాలు తెలిపారు.

## అరుట్ల బుగ్గ జాతరకు ఎమ్మెల్యే మల్ రెడ్డి



ఇబ్రహీంపట్నం నవంబర్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్)

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండలం అరుట్ల లోని కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి జాతరకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ MLA మల్ రెడ్డి రంగారెడ్డి శుక్రవారం ఉదయం రానున్నట్లు యాచారం మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజా నిర్వహించనున్నట్లు రాచర్ల వెంకటేశ్వర్లు తెలిపారు. కావున భక్తులు స్థానిక నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకుల మరియు కార్యకర్తలు అభిమానులు శివ భక్తులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## నేడు డయల్ యువర్ డీఎం ఫోన్ ఇన్ కార్యక్రమం



ఇబ్రహీంపట్నం నవంబర్ 14 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్)

ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు శుక్రవారం సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వర కు డయల్ యువర్ డీఎం ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ తెలిపారు. ఇబ్రహీంపట్నం డిపో పరిధిలోని పరిసర ప్రాంతాల ప్రయాణికులు తమ సూచనలు, సలహాలు ప్రయాణికుల సమస్యలు, అదనపు బస్సులు, బస్సు వేళల్లో మార్పులు, తెలియజేయడానికి 7382924900 కు ఫోన్ చేయాలని డియం సూచించారు. ఆర్టీసీ అభివృద్ధి కి తోడ్పడగలరని కోరారు. ప్రజలు ప్రయాణానికి ఆర్టీసీ బస్సులే ఉత్తమమని ఆయన చెప్పారు

# బాలల దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ చేసిన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత



హైదరాబాద్, నవంబర్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)

బాలల దినోత్సవం సందర్భంగా నల్లకుంట, శివానంద నగర్‌లోని నిత్య జనగణమన కేంద్రంలో తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత గుప్తా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ (చాచా నెహ్రూ) చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి హాజరైన బాలబాలికలకు చాక్లెట్లు పంచారు. ఈ కార్యక్రమం నిర్వహించిన వందే ప్రజ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సుజాత గారిని సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నేలంటి మధు, రాజ్యలక్ష్మి, ఎంకే శ్రీనివాస్, ప్రజా ఏక్తా పార్టీ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్, బుద్ధ ప్రవీణ్, పలువురు బాలబాలికలు, ఉపాధ్యాయులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.





# సిర్సనగండ్ల పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేయండి

**-: రామభక్తుల విజ్ఞప్తి**

వెల్దండ, నవంబర్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్)

సిర్సనగండ్ల పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని రామభక్తులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. "గౌరవ ముఖ్యమంత్రి గారు, మీరు గత ప్రభుత్వం పై ఉత్తర తెలంగాణను అభివృద్ధి చేస్తూ, దక్షిణ తెలంగాణని నిర్లక్ష్యం చేస్తున్నారు అని చెప్పి ముఖ్యమంత్రి పదవిలో కూర్చున్నారు. ఇప్పుడు మన ప్రాంతాన్ని కూడా అభివృద్ధి చేయండి. 400 కోట్ల రూపాయలు విడదల చేసి, అపరభద్రాద్రిగా పేరుగాంచిన సిర్సనగండ్లను యాద్రాద్రిలాగా అభివృద్ధి చేయండి" అని రామభక్తులు కోరుతున్నారు. 'మన ప్రాంతం కరువుతో తల్లడిల్లుతోంది. ప్రజలు అప్పుల బాధ ఏగలేక భూములు అమ్ముకుంటున్నారు. ఉత్తర తెలంగాణలో ఒక్క ఎకరం అమ్ముకుంటే మన ప్రాంతంలో 10 ఎకరాలు కొనవచ్చు. ఎందుకు ఇంత దరిద్రము? మన ప్రాంతంలో కూడా ప్రముఖ పుణ్యక్షేత్రం ఉంది, దానిని అభివృద్ధి చేయండి" అని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. "15 సంవత్సరాల నుండి పోరాడుతున్నాం, గత పాలకులు పట్టించుకోలేదు. హైదరాబాద్ సమీపంలో ఉన్న పుణ్యక్షేత్రం అభివృద్ధికి నోచుకోలేదు. కనీసం మీరు ఈ ప్రాంత వాసిగా, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి ఈ గడ్డ రుణం తీర్చుకోండి" అని రామభక్తులు కోరుతున్నారు. "ఈ పుణ్యక్షేత్రానికి సరైన రోడ్డు వ్యవస్థ లేదు. కుర్మేడు నుండి హైదరాబాద్ రోడ్డు మరియు దేవరకొండ నుండి వచ్చే రోడ్డు 4 లైన్ల రోడ్డు వ్యవస్థను ఈ పుణ్యక్షేత్రం వరకు వేయించి అభివృద్ధికి పూలబాటలు వేయండి" అని వారు కోరుతున్నారు. 'మన ప్రాంతం ప్రాచుర్యం పొందాలంటే ఈ పుణ్యక్షేత్రం అభివృద్ధి చెందితీరాలి. మంచి మనస్సుతో ఈ విజ్ఞప్తిని స్వీకరిస్తారని ఆశిస్తున్నాం" అని రామభక్తులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా సిరిసనగండ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటారో లేదో.




## బాలల దినోత్సవం సందర్భంగా పలకల పంపిణీ




కల్వకుర్తి, నవంబర్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్)

కల్వకుర్తి మండల పరిధిలోని తాండ గ్రామంలో బాలల దినోత్సవం సందర్భంగా అంగన్వాడి సెంటర్ ఫస్ట్ లో బాలల దినోత్సవం డి లక్ష్మయ్య మున్నాభా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాలలతో కేక్ కట్ చేయడం జరిగింది. గోరేటి అనిల్ కుమార్, ఎట్టి రమేష్ బాలల దినోత్సవం సందర్భంగా బాలలకు పలకలు పంపిణీ చేశారు. గోరేటి అనిల్ మాట్లాడుతూ, "ఈనాటి బాలలే రేపటి పౌరులు. విద్యార్థుల పట్ల మానవత దృపంతో ఉండాలి. అప్పుడే విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని అధిగమిస్తారు" అని విద్యార్థులకు తెలిపారు.

## నేడు ఇస్కాన్ ... నగర సంకీర్తన మరియు హారే కృష్ణ ప్రచార కేంద్రంలో కార్తీక దామోదర హారతి

ఇబ్రహీంపట్నం నవంబర్ 14 ( నీలగిరి ఎక్స్ ప్రెస్స్)

యాచారం మండలం మాల్ మార్కెట్ లో ప్రొద్దుటూరి దేవేందర్ దాస్ ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 4:30 కు మాల్ మార్కెట్ లో నగర సంకీర్తన మరియు హారే కృష్ణ ప్రచార కేంద్రంలో కార్తీక దామోదర హారతి రాత్రి 7:30 కి మరియు స్వాముల ప్రవచనములు తదనంతరం ప్రసాదవితరణ జరుగును.... కావును భక్తులు ప్రతీ ఒక్కరూ ఈ కార్తీక దామోదర హారతి అనే సువర్ణ అవకాశం వినిగించుకొని మీ స్వహస్తాలతో ఆ యశోదా ధమోదరునికి నెయ్యి హారతిని చూపించి మీ జన్మజన్మల పాపాలు తొలిగించుకునే ప్రయత్నం చెయ్యండి.... అని దేవేందర్ దాస్ తెలిపారు.




## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా అకాడమీ ఆఫీసర్ ఆజాద్ చంద్రశేఖర్



(నీలగిరి ఎక్స్ ప్రెస్) న్యూస్- నర్సింహులపేట

మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశాన్ని పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆజాద్ చంద్రశేఖర్ తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతు పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు సరైన రీతిలో చదువుకునేటట్లు ప్రోత్సహించాలని తెలిపారు. డిసెంబర్ లో నిర్వహించనున్న (ఎన్ ఏ ఎస్ ) పరీక్షలలో విద్యార్థులు మెరుగైన ప్రదర్శన చూపేటట్లు ఉపాధ్యాయులు ప్రతిరోజు( ఎన్ఏఎస్) పరీక్షలకు సంబంధించిన పరీక్ష అంశాలను బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. రామ్మోహన్ రావు , ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మృతి

చెన్నూర్, నవంబర్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)

చెన్నూర్ మండలం వెంకంపేట గ్రామంలో జాడి సమ్మక్క కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందింది. నిరుపేద కుటుంబానికి చెందిన సమ్మక్క అందరితో ఆప్యాయతగా కలిసిపోయి ఉండే వ్యక్తిత్వం గల మనిషి చనిపోవడంతో కుటుంబసభ్యులు దుఃఖ సంద్రంలో మునిగిపోయారు.



# షెడ్యూల్డ్ కులాలకు సంక్షేమ పథకాలు సకాలంలో అందించాలి







**- జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్**

**రంగారెడ్డి, నవంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

షెడ్యూల్డ్ కులాల వారికి సంక్షేమ పథకాలు సకాలంలో అందించాలని జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలో జరిగిన సమావేశంలో, కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా అధికారులు మరియు పోలీసు అధికారులతో కలిసి షెడ్యూల్డ్ కులాలకు వివిధ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా, కమిషన్ సభ్యులు మాట్లాడుతూ, "జిల్లాలో షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు పోస్టుమెట్రిక్స్ స్కాలర్షిప్లు ఏ మేరకు అందుతున్నాయో, ఎస్సీ జూనియర్ అడ్వకేట్లకు ప్రోత్సాహకాలు ఏ విధంగా అందుతున్నాయో తెలుసుకోవాలి" అని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ఎస్సీ కాలనీలలో రోడ్ల నిర్మాణాలకు ఎంజిఎన్ఆర్ స్కీం ద్వారా ఎన్ని నిధులు విడుదలైనాయో, విడుదలైన నిధుల ద్వారా ఎన్ని కాలనీలలో రోడ్ల నిర్మాణాలు చేపట్టిన వివరాలు తెలపాలని, చిన్న మధ్య తరగతి పరిశ్రమలలో ఎస్సీ కులాల వారికి సబ్సిడీలు యూనిట్ల వివరాలు తెలుపాలని పేర్కొన్నారు. "ఎస్సీ కులాలకు ఇచ్చిన భూముల పరిరక్షణలో రెవెన్యూ శాఖ దృష్టి పెట్టాలి. ఎస్సీ ఎస్టీ కేసులపైన తగు చర్యలు తీసుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే సంక్షేమ పథకాలను సకాలంలో ఖర్చు చేసి, షెడ్యూల్డ్ కులాల సంక్షేమానికి అన్ని శాఖలు కృషి చేయాలి" అని సూచించారు. కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ కలెక్టరేట్ ఆవరణలో మొక్కను నాటారు. ఈ సమీక్ష సమావేశంలో, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జాతీయ కమిషన్ డైరెక్టర్ సునీల్ కుమార్ బాబు, మహేశ్వరం డీసీపీ సునీత, ఎల్బీనగర్ డీసీపీ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులపై దాడిని ఉపేక్షించొద్దు







**- నిందితులు ఎంత వారైనా కఠిన చర్యలు తీసుకోవాలి**

**- ఘటన వెనుక కుట్రదారులను శిక్షించాలి**

**- పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి**

**- తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి డిమాండ్**

**-లగచర్ల ఘటనకు నిరసనగా హైదరాబాద్ కలెక్టరేట్ ముందు ధర్నా**




**హైదరాబాద్ నవంబర్,14(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

వికారాబాద్ జిల్లా, దుద్యాల మండలం, లగచర్లలో అధికారులపై జరిగిన దాడి ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యోగుల ఐకాస చైర్మన్ వి.లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఘటన వెనుక ఎవరున్నా, ఎంతవారైనా ఉపేక్షించొద్దని కోరారు. లగచర్ల ఘటనకు నిరసనగా తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు గురువారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ముందు ధర్నాలు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం హైదరాబాద్ కలెక్టరేట్ ముందు ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉద్యోగుల ఐకాస చైర్మన్ వి.లచ్చిరెడ్డి హాజరయ్యారు. దాడి వెనుక దాగి ఉన్న కుట్రను బహిర్గతం చేయాలి:లచ్చిరెడ్డి

ధర్నాను ఉద్దేశించి వి.లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులపై దాడికి పాల్పడి, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు కుట్రపన్నిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో మరోసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజల కోసం పని చేసే ప్రభుత్వ అధికారులను లక్ష్యంగా చేసుకొని దాడి చేయడంలో కుట్ర కోణం దాగి ఉంటుందని ఆరోపించారు. ఇప్పటికే పోలీసుల విచారణలో వెలుగులోకి వస్తున్న విషయాలు ఉద్యోగ లోకాన్ని భయభ్రాంతులకు గురి చేసిందన్నారు. రాజకీయాలకు అతీతంగా సేవలు అందించే అధికారులపై దాడులు, హత్యాయత్నం వంటి ఘటనలకు పూనుకోవడం వెనుకాల బలమైన కుట్ర దాగి ఉందనే అనుమానాలకు బలం చేకూరుతుందన్నారు. తీవ్రంగా గాయపడిన ఏ అధికారిని ఎవరు పరామర్శించలేదన్నారు. చివరకు కొందరు అధికారులపై జరిగిన దాడిని సైతం పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

లగచర్ల ఘటనలో దాడికి గురైన ఉద్యోగులపై కాకుండా, దాడికి పాల్పడిన వారిని పరామర్శించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం హైదరాబాద్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఉద్యోగుల జేఏసీ నాయకులు కె.రామకృష్ణ , జనరల్ సెక్రటరీ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్, ఎస్.రాములు , అధ్యక్షులు తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ , డా.జి.నిర్మల, అధ్యక్షులు తెలంగాణ ఉద్యోగుల అసోసియేషన్, దర్శన్‌గౌడ్ , అధ్యక్షులు తెలంగాణ సీపీయస్ యూనియన్ , సిహెచ్ రవి అధ్యక్షులు, టిడిఆర్ డి ఏ ఓ అసోసియేషన్, డా. కత్తి జనార్దన్, దేవికా , శ్రీరాం, హరికిషన్ , ఉదర గోపాల్ , విజయారావు, సుగంధిని, హేమలత, రాబర్ట్ బ్రూస్, రోహిత్ నాయక్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులు నిబంధనలు తప్పక పాటించాలి

**-జిల్లా ఎంవీఐ రంజిత్ రెడ్డి**




**(నీలగిరి ఎక్స్ ప్రెస్)** ప్రతినిధి/చెన్నూర్

వాహనాలు నడిపే క్రమంలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని మంచిర్యాల మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ రంజిత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం రోజున చెన్నూరు పట్టణ కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించి ఫిట్నెస్ మరియు సరైన ధ్రువపత్రాలు లేని పలు వాహనాలకు జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వాహనదారులు రోడ్డుపై వాహనాలు నడిపే క్రమంలో రోడ్డు నియమాలను పాటిస్తూ, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు వహించాలని, వాహనం నడిపే ప్రతీ ఒక్కరూ లైసెన్సు కలిగి ఉండాలని, లైసెన్సు కలిగి లేని వారు వెంటనే లైసెన్సు తీసుకోవాలని రంజిత్ రెడ్డి సూచించారు.

# పొగాకు స్వాధీనపరచుకున్న పోలీసులు



**నర్సంపేట ఆర్సీ,నవంబర్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**

నర్సంపేట పట్టణంలోని శాంతినగర్ కు చెందిన గుల్లపెల్లి రమేష్ ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నాడని నమ్మదగిన సమాచారం మేరకు నర్సంపేట ఎస్సైలు రవికుమార్,అరుణ్ సిబ్బందితో రమేష్ ఇంటిని తనిఖీ చేయగా తన వద్ద 33,990 రూపాయల విలువ గల పొగాకు ఉత్పత్తులు కలవు. వెంటనే ఇద్దరు సాక్షుల సమక్షంలో పంచనామ నిర్వహించి,వాటిని స్వాధీనపరచుకొని గుల్లపెల్లి రమేష్ పై కేసు నమోదు చేశారు.నర్సంపేట పట్టణంలో ఎవరైనా పేకాట,గంజాయి, పిడిఎస్ బియ్యం,పొగాకు ఉత్పత్తులు,సంబంధిత రవాణా వంటి చట్ట వ్యతిరేకమైన పనులు చేసినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నర్సంపేట టౌన్ సిఐ రమణమూర్తి తెలిపారు.

# ఐకేపీ సెంటర్ ను పరిశీలించి,రైతుల కష్టాలు తెలుసుకున్న

**-జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్**



**జనగామ బ్యూరో, నవంబర్ 14((నీలగిరి ఎక్స్ ప్రెస్)**

:రైతుల కష్టాసుఖాలు తెలుసుకునేందుకు జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్ జనగామ వ్యవసాయ మార్కెట్ చేరుకొని,మార్కెట్ పత్తి యార్డులో ఉన్న ఐకెపి సెంటర్ ని సందర్శించి, పరిశీలించారు.ఈ సందర్భంగా రైతుల కష్టనష్టాలను అడిగి తెలుసుకున్నారు.అక్కడే ఉన్న జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ డీసీపీకీ మార్కెట్లో ఏర్పాట్ల గురించి, తాము కల్పిస్తున్న సౌకర్యాల గురించి, ఐకెపి సెంటర్లో ధాన్యం కొనుగోలు గురించి వివరించి తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐ దామోదర్ రెడ్డి,వ్యవసాయ మార్కెట్ ప్రత్యేక శ్రేణి సెక్రటరీ శ్రీనివాస్, సూపర్వైజర్ శ్రీనివాస్ గారు,ఏ ఇ ఒ అనిల్ ,ఐకెపి సెంటర్ నిర్వాహకులు మరియు రైతులు శ్రీనివాస్ ,రాజు,రమేష్ తదితరులు పాల్గొన్నారు

# నేటి బాలలే రేపటి పౌరులు

**ఘనంగా జాతీయ బాలల దినోత్సవ వేడుకలు**




**(నీలగిరి ఎక్స్ ప్రెస్) నర్సింహులపేట**

పెద్ద నాగారం హైస్కూల్ లో గురువారం బాలల దినోత్సవం సందర్భంగా స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

ప్రతిరోజు స్కూల్ యూనిఫామ్ ధరించి, పుస్తకాలు చేతబట్టి పాఠశాలకు వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయుల వేషాధారణతో పాఠశాలకు వచ్చి విద్యార్థులకు విద్యాబోధన చేయడం ఎంతో ఆకట్టుకుంది. బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జానకి సుమన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. నేటి బాలలే రేపటి పౌరులని, చాచా నెహ్రూకు పిల్లలంటే చాలా ఇష్టమని, పిల్లల హక్కుల కోసం ఎంతో కృషి చేశారని, అందుకు ఆయన జన్మదినాన్ని బాలల దినోత్సవం గా జరుపుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సికిందర్, లచ్చు,నగేష్, నరసింహారెడ్డి నామ వెంకటేశ్వర్లు,బాల వేణు రాజు, మహేశ్వరి ,విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.